# సారాంశం



పేపర్లో ఆ వార్త చదివేసరికి నాకు ఎక్కడ లేని బాధ కలిగింది. అయినా నేను చెయ్యగలిగింది ఏమీ లేదు.

అర్ధరాత్రి స్కూటరు మీద వస్తున్నాను. అయినా ఆ రైలు యింత లేటు రావడం వల్లే కదా! యిలా అర్ధరాత్రి ఒంటరిగా రావడం.

* * *

నాలుగు రోడ్ల జంక్షన్లో పోలీసుల్ని దూరం నుండే నేను గమనించాను. వాళ్లు నన్ను ఆపారు. నా దగ్గర స్కూటరు సీ బుక్కు, డ్రైవింగ్ లైసెన్సు, యిన్సూరెన్సు కాయితాలు కూడా వున్నాయి. అవన్నీ కాక మా కంపెనీ బ్యాడ్జీ కూడా వుంది. ఆ మాత్రం గుర్తింపు చాల్లు. పైగా నేను రైల్వే స్టేషన్ నుండి వస్తున్నాను.

"ఏయ్... ఎక్కడ్నించి వస్తున్నావ్...?" యిద్దర్లో ఒకడు నన్ను గదమాయించి అడిగాడు.

"స్టేషను నుండి..." నా మాట తడబడింది. ఎంతటి ధైర్యస్తుడికైనా నడిరోడ్డు మీద పోలీసులు ఆపితే మాట తడబడతదా!

'నిజమేనా?' రెట్టించాడు.

'అవున్సార్... కోణార్క్ ఎక్స్‌ప్రెస్ లేటయ్యింది.'

'ఒరేయ్ టూ నాట్ టూ... ఆ డిటెక్టర్ యిలా అందుకో...'

టూ నాట్ టూ అందించిన డిటెక్టర్ ఏమిటో నాకర్థమయింది.

"అబ్బే నేను తాగలేద్సార్... అయినా..." నా నోట్లో మాట నోట్లోనే వుండిపోయింది. వాడు... ఆ పోలీసు ఆ టిటెక్టర్ నా నోటి దగ్గర పెట్టాడు.

'గట్టిగా గాలి వదులు నోటి ద్వారా...' అరిచాడు.

వాడన్నంత పనీ చేసాను.

'ఈయన తాగలేద్సార్...' పక్కవాడు ఆనందంగా అన్నాడు.

'నీ పేరేంటి...?' జేబులోంచి నోట్ బుక్ తీస్తూ అడిగాడు.

'ఎందుకు సార్...?' భయంగా అడిగాను.

'ఎందుకేంటి... వెధవ ప్రశ్న. నువ్వు తాగనందుకు...' సీరియస్‌గా అన్నాడు.

'తాగకపోతే కేసా?' ఆశ్చర్యంగా అన్నాను.

'పేపరు చదవలేదా? తాటికాయలంత అక్షరాలతో మద్య నిషేధం ఎత్తివేసినట్లు అచ్చవేసారు.

'ఆ విషయం చదివానను కోండి... అయినా తాగితే తప్పు కానీ.'

'ఇప్పడది రివర్సయ్యా. తాగకపోతే తప్పు, వంద రూపాయలు ఫైను కట్టు.'

'ఇది అన్యాయం సార్... అలా అని పేపర్లో వెయ్యలేదు.'

'అన్నీ పేపర్లో వెయ్యరయ్యా... మందు కొట్టకపోతే ఫైను కట్టాల్సిందే... లేకపోతే గవర్నమెంటుకి రెవెన్యూ ఎలా వస్తుందనుకున్నావ్...'

'మద్య నిషేధం ఎత్తేస్తే రెవెన్యూ వస్తుందా?'

'ఎవరికి? గవర్నమెంటుకి... మా వోట్లో మట్టేగా... అందుకే మందు కొట్టకపోతే ఫైను కట్టాల్సిందే... తొరగా వంద కొట్టు... అవతల మరో స్కూరు వస్తోంది.

వందా సమర్పించి కేసు లేకుండా బైటపడ్డాను.

* * *

'స్టోర్లో ఉప్పలు, పప్పలుతో పాటు మందు కూడా అమ్ముతున్నారట' చెప్పాడు మా కొలీగ్ రామారావు.

'అవును. గవర్నమెంటు మందు అమ్ముకోమని లైసెన్సు యిచ్చిందిగా... మా కొలీగ్ అన్నాడు.

వాళ్లిద్దరితో పాటు నేను కూడా మందు కొట్టాను అందుకే ఆ విషయం మాకు వింతగా తోచింది.

నెలాఖర్లో ఒక సర్క్యులర్ వచ్చింది. అదీ గవర్నమెంటు జీవోని బట్టి మా కంపెనీ వాళ్లు విడుదల చేసారు.

అందులో సారాంశం మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. అన్యాయం అని అరవాలనిపించింది. కానీ అది గవర్నమెంటు జీవో... ఆమధ్య మద్య నిషేధం పెట్టినప్పడు గవర్నమెంటు రెవెన్యూ పడిపోయిందని అడ్డమైన పన్నులు మధ్య తరగతి వాళ్ల మీద రుద్దేస్తున్నప్పడు నోరు మూసుకు వుండిపోయాము. అందులో ఒకటి ప్రొఫెషనల్ టాక్సు. అది మాకు డైరెక్టుగా దెబ్బ.

మద్య నిషేధం ఎత్తేసారు కదా మళ్లీ ప్రొఫెషనల్ టాక్స్ తగ్గిస్తారేమో అని ఎదురుచూసాము. పులి మీద పుట్రలా అది తగ్గించకపోగా ఈ దిక్కుమాలిన కొత్త జీవో మా నెత్తిమీద పిడుగులా పడింది.

జీతంలో పది శాతం డబ్బుకి బదులు లిక్కర్ యిస్తారట. అది అందరికీ కంపల్సరీ. అదీ అందులోని సారాంశం.

బాబోయ్ మాకు మందు అలవాటు లేదు. మాకు మందొద్దు అని అరచి గోలపెట్టినా లాభం లేదు.

గవర్నమెంటుకి రెవెన్యూ తగ్గిపోయిందట. అందుకే ఈ కొత్త జీవో యిలా ఏడిపించింది.

—అంగర వెంకట శివప్రసాదరావు

అయ్యో! నేను ఏడవాలి ఎలాగ? నేనుఅసలు ఏడవగలవా! ఏడ్పు వస్తుందా! అ! ఏడుపురాకపోతే ఎలాగ! తప్పక ఏడవాలి. కుమిలి కుమిలి ఏడవాలి. ఎలా నాకు ఏడుపు రాదే. తీరా అక్కడి కెళ్ళాక ఏడుపు రాకపోతే. నలుగురిలోనూ ఎంత అప్రతిష్ట అందులోను వెళ్ళేది అత్తగారి తరపు బంధువులు ఇంటికి మరీ ముఖ్యంగా పరామర్శకు.

ఒకవైపు చీర కట్టుకుంటేనే ఆలోచిస్తున్నాను. పరామర్శకు వెళ్ళడం నాకు అసలు ఇష్టం లేదు. మా ఆయన బలవంతంగా పంపిస్తున్నారు. "నాకు ఆఫీసులో లీవ్ దొరకదు. నువ్వు అయినా వెళ్ళకపోతే బావుండదు అని" నేను బయలుదేరడం. అయితే బయలుదేరుతున్నాను గానీ ఏడ్పు రాదు. రాకపోతే ఎలాగ ఎడ్వాలి. ఏడ్వి తీరాలి.

వాళ్ళిల్లు దగ్గరయ్యే కొద్ది నా గుండెలు పీచు పీచు మంటున్నాయి. ఏడుపు రాకపోతే అంత మందిలోనూ నా పరువు పోతుంది. ఎలా

# పరామర్శ



పరస లక్ష్మీదేవి

ఏడవాలి. గ్లిజరిన్ అయినా కళ్ళ దగ్గర పెట్టుకోవలసింది. తడబడే అడుగులతో గేటు తీసుకుని లోపలికి వెళుతుంటే నా చీర గేటుకు తగులుకుని పర్‌మని చిరిగింది. ఒక్క క్షణం గుండాగినట్టయింది.

నాకు ఎంతో ఇష్టమైన చీర మా ఆయనతో పోట్లాడి మరీ కొనిపించుకున్న చీర. మా ఎదురింటావిడతో పోటీ పడి కొనుక్కున్న చీర నా కళ్ళ ముందే చిరిగిపోతే అప్పడొచ్చాయి నీళ్ళు.

లోపలి నుంచి ఎవరో వస్తే వాళ్ళని పట్టుకుని బావురుమని ఏడ్చాను.

అయ్యో!ఊరుకోమ్మా! పోయిన వాళ్ళందరూ అదృష్టవంతులు. నువ్వే ఇలా ఏడిస్తే వాళ్ళని ఎవరు ఓదారుస్తారు చెప్పు ఈ సమయంలోనే మనస్సుని రాయి చేసుకోవాలి. ఎవరో నన్ను ఓదారుస్తుంటే నా చిరిగిపోయిన చీరని చూసుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్నాను నేను.